క్లుప్తంగా

పెద్దమ్మతల్లి యూత్ నూతన కమిటీ ఎన్నిక

కమలాపూర్: మండలంలోని శనిగరంలో పెద్దమ్మ తల్లి యూత్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా గీకురు సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా బండి శ్రీనివాస్, కోశాధికారిగా బండి రమేష్, డైరెక్టర్లుగా బండి నాగార్జున, బండి సుమంత్, బండి నాగరాజు, బండి పవన్‌కళ్యాణ్, బండి అశోక్, బండి ఈశ్వర్ ఎన్నికయ్యారు. మరో 17 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'చల్లా' జన్మదిన వేడుకలు

శాయంపేట : పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన స్వగ్రామమైన ప్రగతి సింగారంలో గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎల్లాగౌడ్



కమలాపూర్ : కమలాపూర్‌లోని గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా పబ్బు ఎల్లాగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు శనివారం స్థానికంగా సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జక్కు ప్రభాకర్‌గౌడ్, కోశాధికారిగా పచ్చిమట్ల రాజేష్‌గౌడ్, డైరెక్టర్లుగా కూనూరి సమ్మయ్యగౌడ్, పెరుమాండ్ల భూపాల్‌గౌడ్, బాలసాని రవిగౌడ్, మండ రాజుగౌడ్, పబ్బు స దయ్యగౌడ్, జేరిపోతుల పుల్లయ్యగౌడ్, కారోబార్‌గా గోపాల్‌గౌడ్ ఎన్నికయ్యారు.

ఎంజేపీ గురుకులాల ఆర్‌సీఓగా శ్రీరాములపల్లి వాసి

కమలాపూర్: మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన మోతె రాజ్‌కుమార్ ఎంజేపీ గురుకులాల వరంగల్ ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓగా నియమితులయ్యారు. శనివారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. మోతె కౌసల్య-కిష్టయ్య దంపతుల కుమారుడైన రాజ్‌కుమార్ శ్రీరాములపల్లిలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఇంటర్, డిగ్రీ వరంగల్‌లో పూర్తి చేశారు. రాజ్‌కుమార్ ఎంజేపీ గురుకులాల వరంగల్ ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓగా నియమితులవడంపై మండల వాసులతో పాటు శ్రీరాములపల్లి, అంబాల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర సహాయమంత్రిని కలిసిన బీజేపీ నేతలు



ఎల్కతుర్తి: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో బీజేపీ మండల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఆయనను సన్మానించారు. అనంతరం మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు నాయకులు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పల్లెపాటి మధుకర్, హంబీర్ శ్రీనివాస్, సుకినె సుధాకర్, లచ్చిరెడ్డి, రాజు, సమ్మయ్య, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగర ఎస్సైగా గొలిపెల్లి దివ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మడికొండ ఎస్సైగా పనిచేసిన దివ్య బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన నీలోజు వెంకటేశ్వర్లు దుగ్గొండి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లు తెలిస్తే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం, మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సై దివ్యకు సిబ్బంది పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శాయంపేట : పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఎస్ఐ చర్చి పాస్టర్ డి.అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో స్త్రీల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహిస్తే కుటుంబ అభివృద్ధిలో ప్రత్యేక పాత్ర పోషిస్తారని తెలిపారు. అనంతరం స్త్రీలను శాలువాలతో సన్మానించారు. పాస్టర్ ప్రవళిక, పాల్, బాబు, జ్యోత్స్న, సౌందర్య, అన్నపూర్ణ, ప్రమీల పాల్గొన్నారు.

అత్మకూరు: శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం



పరకాల : హీరోహోండా షోరూం వద్ద పూజలు



దామెర : పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొలువుదీరిన బొజ్జ గణపయ్య

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పరకాల, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, శాయంపేట, ఆత్మకూరు, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు, కమలాపూర్, దామెర మండలాల్లోని వివిధ గ్రామాల్లో వాడవాడలా బొజ్జ గణపయ్య శనివారం కొలువు తీరాడు. భక్తులు ఎవరికి తోచిన విగ్రహాలను వారు వేద మంత్రోచ్ఛరణముల మధ్య ఘనంగా ప్రతిష్ఠించుకున్నారు. మండపాల్లో 9 రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు కమిటీలను ఏర్పాటు చేసుకుని నిర్విఘ్నంగా వేడుకలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలను అలంకరించడంతో విగ్రహాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో కొలువుదీరిన గణపతికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



ఐనవోలు : పసుపుతో గణేషుని తయారు చేసిన చిన్నారి శ్రీనిజ



వేలేరు : పీచరలో..



పరకాల : వెలమవాడలో శంఖు ఆకృతిలో..



ఆత్మకూరు : పోచమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం



ఎల్కతుర్తి : పూజలు చేస్తున్న భక్తులు



కమలాపూర్‌లో..



శాయంపేటలో..



ఐనవోలు: మల్లన్న ఆలయంలో..



పరకాల : మార్కెట్ రోడ్డులో శక్తి స్థల్ వద్ద..

దరఖాస్తు చేసుకోవాలి

ధర్మసాగర్/వేలేరు: మండలంలోని నారాయణగిరి సెక్షన్‌లోని విద్యుత్ మీటరు లేని వినియోగదారులు గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఈ కుమారస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీటర్ లేకుంటే గృహ జ్యోతి పథకం వర్తించడం లేదని, ఈనెల 17 నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అదే నెల నుంచి గృహజ్యోతి కింద జీరో బిల్లులు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15 వరకు విద్యుత్ సిబ్బంది పేద కుటుంబాలకు అవగాహన కల్పించి మీటర్ల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ తేదీ వరకు దరఖాస్తు చేసిన కుటుంబాలకు కూడా సెప్టెంబర్ 17వ తేదీన ప్రారంభమయ్యే ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కింద అవకాశం కల్పించనున్నట్టు వెల్లడించారు. కొత్త మీటరుకు డెవలప్‌మెంట్ చార్జీల కింద రూ.708, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 200, అప్లికేషన్ చార్జీలు రూ.29.50 మొత్తం రూ. 937.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

శాయంపేట : పెద్దకోడెపాక నుంచి పరకాల క్రాస్ వరకు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారినా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మండిపడ్డారు. పెద్దకోడెపాక నుంచి పరకాల క్రాస్ వరకు వెళ్లే రోడ్డును ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దకోడెపాక నుంచి పరకాల క్రాస్‌కు వెళ్లే రహదారి మొత్తం గుంతల మయమైందని వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కల్యాణ్, ఈశ్వర్, హరీష్, గణేష్, సాయి, రాకేష్ పాల్గొన్నారు.

గుడిబండపై అక్రమ నిర్మాణాలు

ఐనవోలు: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని గుడిబండ వద్ద అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకటాపురం శివారులో పాత శివాలయానికి సంబంధించి 8 ఎకరాల 33 గుంటల భూమి ఉందని ఈ ప్రాంతంలో గుట్ట ఉందని చెబుతున్నారు. ఈ గుట్టపైన ఇటీవల పాత శివాలయ పునరుద్ధరణ జరిగిందన్నారు. అయితే ఇటీవల ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సొంత అవసరాల నిమిత్తం గుట్టపై ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నీటి నిల్వకోసం కాంక్రిట్‌తో శాశ్వత ట్యాంక్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ స్పందించి శివాలయానికి సంబందింధించిన భూమి హద్దులు ఏర్పాటు చేసి, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కార్పొరేషన్ ఏర్పాటు

- ప్రజాసేవకు ఎరుకల కులస్తులు సహకారం ఇవ్వాలి
- నాంచారమ్మ గుడి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : ఇందిరాగాంధీ హయాంలో 1976లో ఎరుకల కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చారని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎరుకల కులస్తులను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కూతాటి ప్రభాకర్ తన తల్లిదండ్రులైన సాయమ్మ-ఎల్లయ్య స్మారకార్థం ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్యుడు ఉద్యమకారుడని, నిజాయితీపరుడని, పేదల కోసం పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. రామానుజాపూర్‌లో కాకతీయులు నిర్మించిన నాంచారమ్మ గుడికి వెళ్లడానికి సరైన రోడ్డు లేదని, మంత్రి సీతక్క సహకారంతో గుడికి వెళ్లడానికి బీటీరోడ్డు నిర్మాణం చేపడుతానని హామీ ఇచ్చారు. శాయంపేట ఎరుకల సంఘానికి కమ్యూనిటీ భవనం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభాకర్ దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యేకు వినతి

ఎస్టీ షెడ్యూల్ జాతుల్లో వర్గీకరణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, అభివృద్ధిని సూచికగా తీసుకొని వర్గీకరణ చేయాలని, వర్గీకరణ కమిషన్ వేయించేలా సహకరించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఎరుకల కుర్రు సంఘం మండల అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి సారయ్య పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జాతీయ అధ్యక్షుడు బలిగి ప్రభాకర్, రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, కోశాధికారి వనం రమేష్, ఉపాధ్యక్షులు కోనెటి రాజు, శ్రీరామ్, ఆనంద్, కోనేటి సమ్మయ్య, కూతాటి సురేష్, వివిధ జిల్లా అధ్యక్షులు కేతిరి రాజశేఖర్, సమ్మయ్య, శ్రీనివాస్, సుభాష్, బాపు, నాయకులు కర్ణాకర్, రీగన్, రీనాకర్, నరేందర్, సూరయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ విగ్రహావిష్కరణ

మండలంలోని మైలారం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అరికిల్ల శ్రీధర్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రవి, మార్కండేయ,రవీందర్, సాంబయ్య, కృష్ణమూర్తి, కట్టయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్ర పూజలు



మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

ఐనవోలు: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని కక్కిరాలపల్లి గ్రామంలోని స్వయంభూగా వెలిసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి పంచామృతాలు, పండ్ల రసాలతో ఆదివారం విశేష అభిషేకాలు, పూజలు చేశారు. అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పాంచరాత్ర ఆగమానుసారం కల్యాణం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతోపాటు నక్షత్రహారతి సమర్పించారు. ఆచార్యులు వేంకటరత్నం, జయకృష్ణ, నాగేంద్ర, అరుణ్‌కుమార్, హరికృష్ణ, భక్తులు ఉమారాణి, హైమావతి, భారతి, సులోచన పాల్గొన్నారు.

'ఓం' జెండాల ఆవిష్కరణ



పరకాల: గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఓం జెండాలను ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి దేవస్థానం ఆవరణంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ డాక్టర్ నాగబండి విద్యాసాగర్ మాట్లాడుతూ ఉత్సవ సమితి ఆవిర్భవించినప్పటి నుంచి పట్టణంలోని ప్రతి మండపానికి జెండాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు బండి సారంగపాణి, గందె వెంకటేశ్వర్లు, ఆర్పీ జయంత్‌లాల్, రాజేశ్వర్‌రావు, రవి, పూర్ణాచారి, రవీందర్, సాంబశివుడు, రాకేష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బురద రోడ్డుపై నడిచేదెలా ?



మండలంలోని పంగిడిపల్లిలోని రేషన్‌షాపు వద్ద ఉన్న రోడ్డు బురదమయమైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, రేషన్ కోసం వచ్చిపోయే వినియోగదారులు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బురదమయమైన రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మించాలని పంగిడిపల్లి వాసులు కోరుతున్నారు. – కమలాపూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : మధు, ఏఈ పీఆర్
ఫోన్‌నంబర్: 85238 80451

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి

ఐనవోలు: రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి, రైతు భరోసా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. వెంకటాపూర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన రైతుభరోసా హామీపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ హనుమకొండలో కొనసాగుతున్న ఐనవోలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఐనవోలులో ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూపరంగా గర్మిళ్లపల్లి, వెంకటాపూర్ గ్రామాలు ఐనవోలు మండలంలో కొనసాగుతన్నాయని, పోలీస్‌స్టేషన్ పరిధి మాత్రం జఫర్‌గఢ్ మండలంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ రెండు గ్రామాలను ఐనవోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి విలీనం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పందించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మండల నాయకులు గుండెకారి మహేందర్, దర్శనాల సంపత్, గబ్బెట రాంకుమార్, మడిగె నాగరాజు, గుండెకారి బాబురావు, ఉప్పలయ్య, కవిత, యాకయ్య, వనమ్మ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఎల్కతుర్తి : ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎల్కతుర్తి: మండలంలోని కోతులనడుమ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల చంటి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2005–06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు కలిసి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు చంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో జేరిపోతుల జనార్దన్, శ్రీనివాస్, కిరణ్, కల్యాణ్, మహిపాల్, శేఖర్, శరత్, అజయ్, రాజు, తదితరులు ఉన్నారు.

పరామర్శ

వేలేరు : మండల కేంద్రానికి చెందిన కూరపాటి వెంకటమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించింది. ఆదివారం మాజీ కుడా డైరెక్టర్ బిల్లా యాదగిరి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, లక్ష్మీనారాయణ, సదానందం, ప్రసాద్, శ్రీను, సునీల్, నాగరాజు, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శాయంపేట : శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో కారు అతివేగంతో వచ్చి ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుందని ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన కొడగాని చాణిక్య, ఆరెపల్లికి చెందిన వజీరు రంజిత్‌లు శనివారం రాత్రి మండలంలోని ఆరెపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి రాత్రి సమయంలో టీఎస్ 03ఈఏ 7730 నంబర్ బైకుపై తిరిగి వెళ్తుండగా శాయంపేటలోని ప్రధాన చౌరస్తా వద్ద పత్తిపాక నుంచి మాందారిపేట వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టడంతో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్తుండడంతో అక్కడే ఉన్న శాయంపేట గ్రామానికి చెందిన ఓ జర్నలిస్టు కారును వెంబడించి మాందారిపేట గుట్టల్లో కారును పట్టుకున్నాడు. చాణక్య తల్లి రజిత ఫిర్యాదు మేరకు ముప్పు శ్రీశైలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్ గౌడ్‌ను శాలువాతో సత్కరిస్తున్న బండి సుధాకర్

ఐనవోలు: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ నియమితులు కావడంతో శనివారం మండలానికి చెందిన మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్, మార్నేని వేంకటేశ్వర్‌రావు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.